విపణిలోకి స్కోడా కైలాక్ ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు

న్యూఢిల్లీ, జనవరి 27: ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా స్కోడా..కైలాక్ మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్ర తరం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. 1.0 టీఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 19.68 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. క్లాసిక్, సిగ్నిచర్, సిగ్నిచర్+, ప్రిస్టేజ్ వంటి నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారుకు 5 స్టార్ రేటింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 25 బలమైన భద్రత ఫీచర్లు ఉన్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనేబా తెలిపారు. కేవలం 10.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 188 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారుపై మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయాన్ని కల్పిస్తున్నది.

కెనరా బ్యాంక్ లాభం 4,104 కోట్లు

కే సత్యనారాయణ రాజు
కెనరా బ్యాంక్
ఎండీ, సీఈవో

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ కెనరా బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,104 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని గడించింది. ఆదాయం పుంజుకోవడం, నిరర్థక ఆస్తులు తగ్గిపోవడంతో అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,656 కోట్ల లాభంతో పోలిస్తే 12.25 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. బ్యాంక్ ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.39 శాతం నుంచి 3.34 శాతానికి దిగొచ్చాయని, అలాగే నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 0.99 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్టు బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు తెలిపారు.

- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 2.85 శాతం తగ్గి రూ.9,149 కోట్లకు పరిమితమైంది.
- బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 8 శాతం పెరిగి రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా, గ్లోబల్ అడ్వాన్సులు 10 శాతం అధికమై రూ.10.49 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ రూ.24.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

బీమాకు పన్ను సుస్తీ

ఆరోగ్య బీమా, ఔషధాలపై పన్నుల భారం తగ్గించాలన్న డిమాండ్లు

ఈసారి బడ్జెట్‌లోనైనా ఊరట లభించేనా?

న్యూఢిల్లీ, జనవరి 27: ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలు ఈసారి బడ్జెట్‌పై భారీ అంచనాల్నే పెట్టుకున్నాయి. సగటు మనిషి సైతం ఖరీదెక్కిన వైద్య చికిత్సల నుంచి ఉపశమనాన్ని ఆశిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్‌లో ఔషధాలపై పన్నులను తగ్గించాలని, ఆరోగ్య బీమాపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి పడుతున్న భారాన్ని కట్టడి చేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. దేశంలో ఇప్పటికీ చాలా మందికి ఆరోగ్య బీమా లేదన్న విషయాన్ని ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ కూడా గుర్తుచేస్తున్నది. పన్నులకు కోత పెడితే అందరికీ సులువుగా బీమా ప్రయోజనాలు అందుతాయంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. నిర్మలా సీతారామన్‌కు ఇది ఎనిమిదో బడ్జెట్ కానుండగా, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారుకు రెండోది. అయితే గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈ దఫాకు ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కానున్నది.

ప్రోత్సాహకాలివ్వాలి

ప్రజారోగ్య సదుపాయాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, ప్రైవేట్ రంగానికి ఇతర ప్రోత్సాహకాలను అందిస్తే సామాన్యులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు దక్కుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్య సంరక్షణ సేవలపై ఇన్‌పుట్ జీఎస్టీని తగ్గించాలంటున్నారు. ప్రీమియంలతో పోల్చితే వాటి క్లెయింల విలువ ఎక్కువని, కాబట్టి బీమా ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు లభిస్తే బాగుంటుందని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

ఐటీ చట్టంలోని సెక్షన్ 80డీ కింద ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ ఆరోగ్య బీమా కొనుగోలుపై 25,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. అలాగే తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వారి వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు ఏటా చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అయితే ద్రవ్యోల్బణం దృష్ట్యా ఎక్కువ ప్రయోజనాలున్న సమగ్ర పాలసీలనే ఇప్పుడు తీసుకోవాల్సి వస్తున్నది. వాటి ప్రీమియంలూ ఎక్కువే. అందుకే ఈసారి బడ్జెట్‌లో ఈ పన్ను మినహాయింపులను ఇంకా పెంచాలన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కాగా, సెక్షన్ 80డీడీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వ్యక్తిగత వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

ఎన్సీఐ నివేదిక..

ఇక టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ, పన్నుల మినహాయింపును ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఎన్సీఐ రిసెర్చ్ చెప్తున్నది. వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లు 5, 12 శాతం మించకుండా నిర్ణయం రావచ్చని తెలుస్తున్నది. ప్రస్తుతం 18 శాతం పడుతున్నది. కాగా, 'టర్మ్/పూర్తి జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ లేదా ఎలాంటి పన్నులు ఉండరాదు' అని ఎన్సీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొన్నది. ఎన్‌పీఎస్‌కు వీలుగా పాత/కొత్త పన్ను విధానాల్లో జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రత్యేకంగా పన్ను మినహాయింపు రూ.25,000, 50,000 ఉండాలంటున్నది. ఇదే క్రమంలో ఏపీవై, పీఎం-ఎస్‌వైఎం, పీఎం-కేఎంవై, ఎన్‌పీఎస్-ట్రేడర్లు వంటి అన్ని ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీములను ఒకే గొడుగు కిందకు తీసుకురావచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి.

పాత పన్ను విధానానికి స్వస్తి?

పాత పన్ను విధానాన్ని పూర్తిగా పట్టించుకోవట్లేదన్నా అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో పాత పన్ను విధానానికి స్వస్తి పలుకనున్నారన్న అంచనాలున్నాయి. దీనివల్ల ఇకపై ఒకే పన్ను విధానం ఉండనున్నది. ఆయా సెక్షన్ల కింద వివిధ రకాల పెట్టుబడులు, పొదుపు, ఖర్చులపై ట్యాక్స్‌పేయర్స్ పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. కానీ కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. వార్షిక ఆదాయం నిర్ణీత పరిమితి దాటిందంటే ఏ మినహాయింపులకు తావు లేకుండా అందరికీ ఆయా శ్లాబుల ప్రకారం పన్నులు వర్తిస్తాయి. మరోవైపు పాత పన్ను విధానాన్ని ఒకేసారి ఎత్తేయకుండా, రెండేండ్ల తర్వాత రద్దు పోతుందన్న నిర్ణయాన్ని ఈసారి బడ్జెట్‌లో ప్రకటించవచ్చన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా పాత పన్ను విధానాన్ని తొలగిస్తే మదుపు, పొదుపులకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చకపోవచ్చన్న వాదనలు వస్తుండటం గమనార్హం. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు నష్టమేనంటున్నారు. ఇక ట్యాక్స్‌పేయర్స్ ఐటీఆర్‌లను దాఖలు చేసేటప్పుడు కొత్త పన్ను విధానమే డీఫాల్ట్‌గా సెలెక్టై ఉంటుంది. దీన్ని గుర్తించి పాత పన్ను విధానాన్ని ట్యాక్స్‌పేయర్సే ఎంచుకోవాలి. లేదంటే ఐటీ రిటర్నులు కొత్త పన్ను విధానంలోనే ఫైలింగ్ జరిగిపోతాయి.

ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లింపుదారులకు పాత, కొత్త పన్ను విధానాలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఐదేండ్ల కిందట కొత్త పన్ను విధానాన్ని పరిచయం చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఏటా దాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ రకరకాల ప్రోత్సాహకాలు, మినహాయింపుల్ని ఇస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో

జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు రెడీ

రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): జపాన్‌లోని అయిచీ రాష్ట్రం జపాన్‌తో వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అయిచీ అడ్మినిస్ట్రేవ్ డిస్ట్రిక్ ఆఫ్ జపాన్‌కు చెందిన ప్రతినిధులతో మంత్రి సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయిచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహితో కొండో ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది తమ రాష్ట్రంలో జరిగే 20వ ఆసియా క్రీడలకు రావాలని మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు.

క్రెడిట్ కార్డులకు డిమాండ్

ముంబై, జనవరి 27: దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన ఐదేండ్లలో కార్డుల సంఖ్య రెండింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని, ఇదే సమయంలో డెబిట్ కార్డులు మాత్రం యథాతథంగా ఉన్నాయని పేర్కొంది. అలాగే డిజిటల్ చెల్లింపులు కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఐదేండ్ల క్రితం 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు ప్రస్తుతం 99.08 కోట్లకు చేరుకున్నాయి.

హట్సన్ జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 27: అరుణ్ ఐస్‌క్రీం పేరుతో ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న హ్యాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్..జహీరాబాద్ ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నది. గతంలో రోజుకు లక్ష కిలోల ఐస్‌క్రీంలను ఉత్పత్తి అవుతున్న ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 1.27 లక్షల కిలోలకు పెంచుకున్నట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్ తెలిపారు. దీంతో ఈ యూనిట్ దేశంలో అతిపెద్ద ఐస్‌క్రీం యూనిట్ కావడం విశేషమన్నారు. దీంతో గ్రూపు టర్నోవర్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని సూరారం వద్ద రోజుకు 2.8లక్షల లీటర్ల పాలను కలుపుకోని 20 ప్లాంట్లలో రోజుకు 32 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నదని చెప్పారు.

మార్కెట్లో ట్రంప్ క్రాష్

ముంబై, జనవరి 27: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ పరస్పర సుంకాల సమరానికి కాలుదువ్వుతున్నట్టు సంకేతాలు రావడంతో మదుపరులు ఒక్కసారిగా భయాందోళనకు లోనయ్యారు. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోగా.. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ రెండూ పెద్ద ఎత్తున క్షీణించాయి. సెన్సెక్స్ 824.29 పాయింట్లు లేదా 1.08 శాతం కోల్పోయి 76వేల స్థాయికి కింద 75,366.17 వద్ద ముగియగా, నిఫ్టీ 263.05 పాయింట్లు లేదా 1.14 శాతం పడిపోయి 23వేల స్థాయికి దిగువన 22,829.15 వద్ద స్థిరపడింది. దీంతో గత ఏడాది జూన్ నుంచి ఈ స్థాయిల్లోకి సూచీలు క్షీణించడం ఇదే తొలిసారైనట్టైంది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 922.87, నిఫ్టీ 305.30 పాయింట్లు పతనమయ్యాయి.

9.28 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.9,28,229.09 కోట్లు హరించుకుపోయింది. చివరకు రూ.4,10,23,624.90 కోట్ల వద్ద ఆగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.51 శాతం, మిడ్‌క్యాప్ 2.68 శాతం మేర నష్టపోయాయి. ఐటీ, టెక్నాలజీ, మెటల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, చమురు-గ్యాస్ షేర్లు 3.31 శాతం నుంచి 2.41 శాతం వరకు నష్టపోయాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది మొదలు బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపద 32 లక్షల కోట్లకుపైగా కరిగిపోయింది.

మాటాడ్లుతున్న సతీష్‌కుమార్

విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అవసరం

- కిట్స్ కార్యదర్శి వీ సతీష్‌కుమార్

హుజూరాబాద్ రూరల్,జనవరి27: పరిశ్రమలకు కావలసిన నైపుణ్యం గల మానవ వనరులను అందించేందుకు విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అవసరమని కిట్స్ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ పేర్కొన్నారు. సింగాపూర్ కిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'అడ్వాన్సస్ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ 4.0 సినారియో ' పేరిట ఆరు రోజుల కార్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. పరిశ్రమలలో వస్తున్న నూతన సాంకేతిక విజ్ఞానాన్ని నేర్చుకొని విద్యార్థులకు బోధించినచో పరిశ్రమలకు నైపుణ్యం గల మానవ వనరులు దొరుకుతాయన్నారు. ఇక్కడ మెకానికల్ ఇంజినీరింగ్ సమన్వయకర్త రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య , మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎమ్‌వి సతీష్ కుమార్, ప్రొఫెసర్ మల్లయ్య, అధ్యాపకులు ఉన్నారు.

యూజీసీ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి

ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కమాన్‌చౌరస్తా, జనవరి 27: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేశ్, మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగిస్తున్న యూజీసీ గైడ్ లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, యూనివర్సిటీల వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మచ్చ పవన్, కళ్యాణ్, బోయిని విష్ణువర్ధన్, ప్రనిష్, మహేష్,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విచ్ఛిన్నం చేసే ప్రక్రియ..

యూజీసీ మార్గదర్శకాలను తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ అని, దాని ద్వారా యూనివర్సిటీలలో స్వయం ప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కాల్వలో తెగిపడ్డ 33కేవీ లైన్

ముకరంపుర, జనవరి 27: కరీంనగర్ నుంచి బద్దిపల్లికి వెళ్లే 33కేవీ లైన్ చింతకుంట కెనాల్ మీదుగా వెళ్తున్నది. సోమవారం ఒక్కసారిగా తెగిపోయి పక్కనే ఉన్న కాకతీయ ప్రధాన కాల్వలో పడిపోవడంతో సమస్య ఏర్పడింది. బద్దిపల్లితో పాటు ఆచంపల్లికి సరఫరా నిలిచిపోయింది. కాల్వలో పడిపోయిన తీగను బయటకు తీసి లైన్‌కు మరమ్మతు చేస్తే తప్ప సరఫరాను పునరుద్ధరించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బద్దిపల్లి ఏఎల్ఎం రాజు నీళ్లు నిండుగా ఉన్న కాల్వలోకి తాడు సాయంతో దిగి ఈత కొడుతూ అవతలి వైపున నీళ్లలో పడిపోయిన 33కేవీ తీగను బయటకు తీసుకువచ్చారు. మరమ్మతులు చేపట్టి సాయంత్రం సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా రాజును కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘుతో పాటు ఏఈలు అభినందించారు.

నగర'పాలన' నేటితో సమాప్తం

- ముగియనున్న పాలకవర్గాల పదవీ కాలం
- 'ప్రత్యేక' పాలనలోకి కరీంనగర్ కార్పొరేషన్
- బీఆర్ఎస్ హయాంలో గణనీయమైన ప్రగతి
- మారిన నగర రూపురేఖలు
- ప్రభుత్వ మారడంతో ఏడాదిగా అభివృద్ధికి బ్రేక్
- ఎక్కడి పనులు అక్కడే

కార్పొరేషన్, జనవరి 27: మరికొద్ది గంటల్లోనే కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం పాలన ముగుస్తున్నది. మంగళవారంతో పదవీకాలం సమాప్తం కాబోతున్నది. బుధవారం ప్రత్యేక అధికారి పాలన అమల్లోకి రాబోతుండగా, గడిచిన ఐదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో నగరం ప్రగతిలో దూసుకెళ్లింది. అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవతో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అప్పటి సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సైతం కరీంనగర్ అభివృద్ధి విషయంలో ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించడంతో నిధుల వరద పారింది.

నగర పాలక చరిత్రలోనే భారీ అభివృద్ధి

నగరపాలక చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా భారీ ఎత్తున్న అభివృద్ధి జరిగింది. నగర రూపురేఖలు పూర్తిగా మార్చేందుకు నేతలు అలుపెరుగని కృషి చేశారు. పాలక వర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన రెండు నెలలకే మాయదారి కరోనా ప్రపంచాన్నే వణికించింది. దేశంలోనే మొదటి 11 కేసులు కరీంనగర్‌లోనే బయటపడ్డాయి. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే, స్థానిక జిల్లా యంత్రాంగం, అధికారులు, ప్రజాప్రతినిధులు అందించిన సేవలను నగర ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. కరోనాతో రెండేళ్ల కాలం గడిచిపోయినా, నగరంలో ఎక్కడా అభివృద్ధికి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టారు. స్మార్ట్‌సిటీ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.350 కోట్ల సీఎం అస్యూరెన్స్ నిధులు, పట్టణ ప్రగతి, హరితహారం నిధులు భారీగా సమకూరగా, సద్వినియోగం చేసుకునే విషయంలో వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. సరికొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోనే ప్రతి రోజూ మంచినీరు అందించే నగరంగా కరీంనగరాన్ని తీర్చిదిద్దారు. ఆ రోజు చేపట్టిన పనులతోనే ప్రస్తుతం మూడేండ్లుగా నిర్విరామంగా నగర ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతున్నది. అలాగే హరితహారంలో పెద్ద సంఖ్యలో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో రోడ్లు, డ్రైనేజీలు, మౌళిక సదుపాయాలను కల్పించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్స్, వాకింగ్ ట్రాక్స్, మోడల్ పబ్లిక్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. నగరవాసులకు పరిశుభ్రమైన వాతావరణంలో అన్ని రకాల ఆహార పదార్థాలు ఒకే చోట దొరికేలా నాలుగుచోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. పద్మనగర్ మార్కెట్ ప్రస్తుతం అందుబాటులోకి రాగా, మిగిలిన మూడు నిర్మాణ దశల్లోనే ఉన్నాయి. నగర ప్రజల ఉల్లాసానికి పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దారు. నగరంలోని చౌరస్తాలకు ఆధునిక సోగబులద్ది సుందరంగా మార్చారు. పారిశుధ్య నిర్వహణలోనూ యాంత్రీకరణ చేపట్టి మెరుగైన పరిశుభ్రత కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేయడంతోపాటు స్వచ్ఛ ఆటోలను తీసుకువచ్చారు. స్వీపింగ్ యంత్రాలను పెద్ద సంఖ్యలో వినియోగంలోకి తెచ్చారు. మొదటి సారిగా నగరంలో డిజాస్టర్ రిసోర్స్ పోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధం చేశారు. ప్రకృతి విపత్తులు జరిగిన సందర్భాల్లో తక్షణమే స్పందించే విధంగా ఆయా విభాగానికి ప్రత్యేకంగా వాహనాలు, సామగ్రిని అందించారు. ఇలా లెక్కలేనన్ని పనులతో నగర రూపురేఖలు మారిపోయాయి.

ఏడాదిగా నిలిచిన అభివృద్ధి

నగరపాలక సంస్థలో బీఆర్ఎస్ హయాంలో మూడేళ్ల పాటు వేగంగా సాగిన అభివృద్ధి ఏడాదిగా నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో ప్రగతికి బ్రేక్ పడింది. ముఖ్యంగా సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నగరపాలక సంస్థలోనూ నిధుల లేమితో నిర్వహణ వ్యయాలకే పరిమితమవుతూ వస్తున్నది. ఈ నెల 28తో పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుండడంతో ప్రభుత్వం నగర పాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ప్రమేలా సత్పతిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, రాబోయే కాలంలో నగరంలో ఏ మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతాయో..? వేచి చూడాల్సి ఉన్నది.

'నాగంపేట'పై ఏసీబీ నజర్?

- జీపీలో నిధుల అవకతవకలపై ఆర్టీఐ దరఖాస్తు నేపథ్యంలో ఫిర్యాదులు

జమ్మికుంట, జనవరి27: నాగంపేట గ్రామపంచాయతీలో అవకతవకలు జరిగాయా..? వచ్చిన నిధులు.. అభివృద్ధి పనుల్లో జరిగిన ఖర్చులో గోల్‌మాల్ జరిగిందా..? నెలలు గడిచినా ఇప్పటి వరకు ఆర్టీఐ దరఖాస్తుదారుడికి అడిగిన వాటికి సమాధానం ఇవ్వడం లేదా..? అంటే అవుననే సమాధానా లు వినిపిస్తున్నాయి. ఇదే నేపథ్యంలో ఆర్టీఐ అంశాలపై జిల్లా ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. దీంతో 'నాగంపేట'పై ఏసీబీ నజర్ వేసినట్లు సమాచారం. కాగా, గ్రామ పంచాయతీ నిధులపై స మాచార హక్కు చట్టం ప్రకారం ఓ వ్యక్తి దరఖాస్తు చేయగా, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శికి బదులు బదిలీపై వెళ్లిన కార్యదర్శి సమాధానం ఇవ్వడంపై గత డిసెంబర్ 18న 'నమస్తే తెలంగాణ'లో కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది' వార్తా కథనాన్ని ప్రచురించింది. దీంతో మండలాధికారులు తూతూమంత్రంగా నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. సం తృప్తి చెందని ఉన్నతాధికారులు, రంగంలో దిగినట్లు సమాచారం. మంగళవారం నాగంపేట గ్రామ పంచాయతీకి జిల్లా అధికారులు రానున్నట్లు తెలిసింది. పంచాయతీలో నిధులు, అభివృద్ధి పనులు, తదితర అంశాలతో పాటూ పనిచేస్తున్న కార్యదర్శి, బదిలీ కార్యద ర్శి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుపై విచారణ చేయనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా గ్రామంలోని పలువురు బాధితులను కలువనున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నాగంపేటపై ఉన్నతాధికారులు, ఏసీబీ నజర్ పడడం కలకలం రేపుతున్నది.

ఆర్టీసీ నిర్వీర్యానికి కాంగ్రె